400 లక్షల కోట్ల దిగువకు..

క్షీణించిన బీఎస్ఈ సంస్థల విలువ

ముంబై, ఫిబ్రవరి 18: బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది.

సూచీలబీ అదేదారి

స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75,967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటర్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

మంగళవారం న్యూఢిల్లీలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు తదితరులు

ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు

- సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.
- కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.
- పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.
- సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.
- ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.
- పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.
- కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.
- వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.
- ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.
- దివ్యాంగుల కోసం కూడా ప్రయోజనకర ఆప్షన్లు.
- www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.
- ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

టీవీఎస్ 2025 ఎడిషన్ రోనిన్ బైకు

ప్రారంభ ధర రూ.1.35 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తి నివ్వనన్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్టు కంపనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగు తాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.

ఎన్ఎస్ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

- **గత ఏడాది 201 శాతం వృద్ధి**

ముంబై, ఫిబ్రవరి 18: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్ఎస్ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కు గాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్టు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్ఎస్ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్ఎస్ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్ఎస్ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

రిలయన్స్ టాప్

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూపులవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.

క్యూ3 జీడీపీ 6.4%!: ఇక్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.7 శాతంగా ఉంటే.. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా ఏడు త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు మార్కెట్‌లో డిమాండ్ బలహీనపడటం, కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గిపోవడం కారణంగా పేర్కొన్న ఇక్రా.. ప్రస్తుతం ఈ రెండు అంశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయని అంటున్నది. అందుకే వృద్ధిరేటు అంచనా 6.4 శాతంగా నమోదు కావచ్చని చెప్పింది. కాగా, ఈ నెల 28న అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ అధికారికంగా ప్రకటించనున్నది. కాగా, ఆర్బీఐ వృద్ధి అంచనా ఈసారికి 6.6 శాతంగా ఉన్నది.

స్టార్టప్‌లకు బ్రెజిల్ దన్ను

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.

టెస్లా ఇండియాలో నియామకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు వేగవంతం చేసిన అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా..తాజాగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించింది. అతి త్వరలో తన తొలి షోరూంను ప్రారంభించబోతున్న సంస్థ అందుకుతగ్గట్టుగా రిక్రూట్‌మెంట్లను ఆరంభించింది. తన తొలి షోరూంను ముంబైలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. నూతన ఉద్యోగాల్లో సర్వీస్ అడ్వయిజర్లు, సర్వీస్ మేనేజర్లు, స్టోర్ మేనేజర్లు ఉన్నారు.

కజారియా నయా సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18: దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీ సంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

బాలికల పాఠశాల తనిఖీ

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, ఫిబ్రవరి 18 : విద్యార్థులు ఇష్టపడి చదవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు

గాంధారి, ఫిబ్రవరి 18 :విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకూడదని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కాలేజ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా, ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 2023- 24 బ్యాచ్‌కు చెందిన మండల టాపర్ అంకితకు రూ. మూడు వేల నగదును కళాశాల అధ్యాపకుడు విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్ గోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, రమేశ్, వెంకట్‌స్వామి, సరిత, సుజాత, రాజ్‌కుమార్, అంజలి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామస్తుల అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేయొద్దు'

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 18: గ్రామస్తుల అందరి అనుమతి లేకుండా విగ్రహానికి స్థలం ఎంపిక చేయడంపై..మండలంలోని మేజర్‌వాడి గ్రామస్తులు మంగళవారం ట్రాక్టర్లపై తరలివచ్చి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అంబేద్కర్ ఒక్క కులం, వర్గానికి చెందిన వాడు కాదని, అందరి వాడన్నారు. గ్రామస్తులందరం కలిసి చర్చించి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఒకే వర్గం వారు తమ ఇష్టానుసారంగా స్థలం ఎంపిక చేసుకొని విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. అధికారులు గ్రామస్తులందరి ఐక్యత, సమ్మతితో స్థలం గుర్తించి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొనేలా చూడాలని కోరారు. గ్రామానికి సోమవారం ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాస్, మండల అధికారుల సమక్షంలో సమస్యను పరిష్కరించామని తహసీల్దార్ అన్నారు. ప్రభుత్వ స్థలం గుర్తించి, భూమి పూజ చేసి, పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామని వారికి ఆయన చెప్పడంతోగ్రామస్తులు వెనుదిరిగారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 18 : వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగు, తాగునీరు, వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించాలన్నారు. రబీ సీజన్ కోసం సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, నీటిపారుదల శాఖ సీఈ రవి, మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఆర్డీవో ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుల రిమాండ్

భిక్కనూరు, ఫిబ్రవరి 18 : ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంపత్, ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన దుమల శివకుమార్ ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 11న ఇంటి వద్ద పార్క్ చేశాడు. ఈ వాహనం చోరీకి గురైంది. కామారెడ్డికి చెందిన షేక్ తోఫిక్, షేక్ అఫ్రోజ్‌ను భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద పట్టుకొని విచారించగా వారు జంగంపల్లి గ్రామంలో, కామారెడ్డి పట్టణంలోని సైలాని బాబా కాలనీలో మరో హోండా యాక్టివను ఎత్తుకెళ్లినట్లు అంగీకరించారని తెలిపారు. వారినుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ నెల 14న భిక్కనూరులో బండి సిద్దగిరి తన ఇంటి వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సిద్ధగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన వల్లపు గట్టు మల్లేశ్‌ను విచారించగా నేరాన్ని అంగీకరించాడు. బైక్ చోరీని ఛేదించిన ఎస్సై ఆంజనేయులును, సిబ్బంది సైదయ్య, రాజాగౌడ్, రామును, సిబ్బందిని సీఐ సంపత్ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంపత్, ఎస్సై ఆంజనేయులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్ద కొడప్‌గల్,(పిట్లం)ఫిబ్రవరి 18: పిట్లం శివారులోని ఇటుక బట్టీల సమీపంలో సంగారెడ్డి - అకోల జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారింది. హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం అంతుర్గం గ్రామానికి చెందిన గైని సంగయ్య తన భార్య శకుంతలతో కలిసి అంతుర్గం నుంచి కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా పిట్లం శివారులో అవేజ్ ఇటుక బట్టీల వద్ద జాతీయ రహదారి 161పై వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. భార్య శకుంతల అక్కడికక్కడే మృతి చెందగా, సంగయ్యకు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. సంగయ్య కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

నిజాంసాగర్, ఫిబ్రవరి 18 : డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలోని వెల్గనూర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గనూర్ గ్రామానికి చెందిన సురిసాని రాజశేఖర్‌రెడ్డి (21) ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే ఫోన్ కలవలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి హన్మంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడులను అరికట్టాలి

సీనియర్ సివిల్ జడ్జి అండ్ సెక్రటరీ నాగరాణి

జ్యోతి ప్రజ్వళన చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అండ్ సెక్రటరీ నాగరాణి

కామారెడ్డి, ఫిబ్రవరి 18 : పాఠశాలల్లో పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టే దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అండ్ సెక్రటరీ నాగరాణి అన్నారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫోక్సో చట్టంపైన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్స్‌కి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి మాట్లాడారు. ఫోక్సో చట్టం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల బాధ్యతను వివరించారు. స్కూల్స్‌లో లైంగికదాడి ఘటనలు ఎదురైతే రిపోర్టు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణలో మొదటిసారిగా ప్రొటెక్షన్ ఆఫీసర్లను కామారెడ్డి జిల్లాలోనే నియమించారని, పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోనీకుట్టి జార్జ్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్రవంతి, సభ్యురాలు స్వర్ణలత, బాల్ రక్షాభవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

భిక్కనూరు పీహెచ్‌సీలో ఫార్మ స్టోర్ పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్

భిక్కనూరు, ఫిబ్రవరి 18 : భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో ఉన్న ఫార్మ గదిలో మందులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మందుల గడువు తేదీని పరిశీలించాలని తెలిపారు. దవాఖానలో నెలకొన్న నీటి సమస్యను ఆయన దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులకు ఆరోగ్య విస్తరణ అధికారి, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, పల్లె దవాఖాన వైద్యులు, ఆరోగ్య విస్తర్ణణ అధికారి వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గాంధారి, ఫిబ్రవరి 18: పోక్సో కేసు నమోదైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెండ్ అయినట్లు సమాచారం. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రమేశ్, అదే పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వాట్సాప్‌లో అభ్యకరంగా మెస్సేజ్‌లు చేశాడని, విద్యార్థిని తల్లిదండ్రులు గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు ఉపాధ్యాయుడు రమేశ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ విషయమై మంగళవారం విచారణ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సమాచారం.

సమస్యలుంటే షీ టీంకు సమాచారమివ్వాలి

గాంధారి, ఫిబ్రవరి 18: విద్యార్థులకు ఎవరైనా ఇబ్బంది పెడితే షీటీం సభ్యులకు సమాచారం ఇవ్వాలని ఎల్లారెడ్డి షీ టీం సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం షీ టీం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, పాఠశాలలో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే షీటీం సభ్యులకు 8712686094 నంబర్‌కు ఫోన్ చేసీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో షీటీం సభ్య